క్లుప్తంగా

6న అయోధ్య రామయ్య శోభాయాత్ర

నందలూరు (రాజంపేట) : నందలూరులో అయోధ్యరామయ్య శోభాయాత్రను హిందువులు ఐక్యతగా ఒకతాటిపైకి వచ్చి నిర్వహించనున్నారు. జనవరి 6న చేపట్టేందుకు నందలూరు మండల వాసులు సమాయత్తమవుతున్నారు. ఈ మేరకు సోమవారం నీలిపల్లె వినాయక ఆలయం వద్ద అయోధ్య రామాలయ శోభాయాత్ర కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా కమిటీ నేతలు శోభాయాత్ర నిర్వహణ తీరుతెన్నులపై చర్చించారు. నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని అరవపల్లె, నీలిపల్లె, నందలూరు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాంతం, పాటూరు తదితర చుట్టుపక్కల గ్రామాల్లో అయోధ్యరామయ్య శోభాయాత్రపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ప్రతి హిందువు శోభాయాత్రకు కదిలివచ్చేలా చైతన్య పరచాలని కోరారు. ఉదయం 8.30 గంటలకు నాగిరెడ్డిపల్లె శివార్లలోని నూతనంగా కడప–రేణిగుంట స్టేట్ హైవే నిర్మాణం జరిగే ప్రాంతంలోని ఎర్రచెరువు కట్టపై వెలసిన ఆంజనేయస్వామి నుంచి అయోధ్య రామయ్య శోభాయాత్ర బయలుదేరుతుందన్నారు. ఈ శోభాయాత్ర నందలూరు గ్రామంలోని సౌమ్యనాథాలయం వరకు కొనసాగుతుందని వెల్లడించారు.

హెల్మెట్ల అందజేత



హెల్మెట్స్‌ను అందజేస్తున్న డీఎస్పీ చైతన్య

రాజంపేట : రాజంపేటలోని కడప–రేణిగుంట జాతీయ రహదారిలో బైక్‌పై వెళ్తున్న వారికి సోమవారం హెల్మెట్లు ఉచితంగా అందజేశారు. వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు సారా రాజేష్ తన పుట్టిన రోజు సందర్భంగా డీఎస్పీ చైతన్య చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సారా రాజేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా తన వంతుగా బాధ్యతగా హెల్మెట్స్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. సారా రాజేష్ వినూత్నంగా సాయం చేయడంపై డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న రిటైర్డ్ మాస్టర్ భక్తవత్సలం

రాయచోటి టౌన్ : పాత రాయచోటిలోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అదే ప్రాంతానికి చెందిన రిటైర్డ్ పీఈటీ మాస్టర్ భక్తవత్సలం తన భార్య 68వ జయంతి సందర్భంగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. సోమవారం అదే ప్రాంతానికి చెందిన 220 మంది పేద మహిళలను గుర్తించి చీరలు అందజేశారు. అలాగే అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కుమారుడు రెడ్డి రూపేష్, పావని, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటి బోరుకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ నాగార్జునాచారి

వీరబల్లి (రాయచోటి టౌన్) : వీరబల్లి మండల పరిధిలోని మట్లి గ్రామం వడ్డెపల్లెలో సోమవారం తాగునీటి సమస్యను పరిష్కరించారు. గ్రామ సర్పంచ్ సోమారపు నాగార్జునారి బోరు మోటారుకు మరమ్మతులు చేయిచడంతో వారం రోజులుగా స్థానికులు పడుతున్న కష్టాలు తీరాయి. కార్యక్రమంలో గుదే నాగార్జున, పుల్లగూర చెన్నకేశవులు, రావూరు రఘురామ, ఉప్పుతోళ్ల సాయిప్రతాప్, పల్లపు రమణ, కత్తి రామకృష్ణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ సంక్షేమ విభాగం ఏడీకి సన్మానం

రాజంపేట : మైనార్టీ సంక్షేమ విభాగం అసిస్టెంట్ డైరెక్టరుగా పదోన్నతి పొందిన గౌస్‌పీర్‌ను ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టరు గండికోట గుల్జార్‌బాషా ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ఓఎస్డీగా జనాబ్ గౌస్‌పీర్ పని చేశారన్నారు. మైనార్టీ సంక్షేమం తరపున గౌస్‌పీర్ అందించిన సేవలు మరువలేవన్నారు. కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ములకలచెరువు: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ గాయత్రి సోమవారం తెలిపారు. మండలంలోని పెద్ద పాలెం సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



రాజంపేట టౌన్ : క్రిస్మస్ తాత(శాంతాక్లాజ్) వేషధారణలో..





రాజంపేట టౌన్ : చర్చిలో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు, రైల్వేకోడూరు : క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, కొల్లం గంగిరెడ్డి

రాజంపేట టౌన్ : కరుణామయుడైన ఏసుక్రీస్తు బాలయేసుగా భూమిపై అవతరించిన ఘడియన విశ్వాసుల హృదయాలు పులకించి భక్తిభావంతో నిండిపోయాయి. క్రైస్తవులు, విశ్వాసుల ఇళ్లు, చర్చిలపై స్టార్లు కాంతులీనాయి. క్రిస్మస్‌ను పురస్కరించుకొని సోమవారం రాజంపేట క్లస్టర్ పరిధిలోని రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు నియోజకవర్గాలు ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నాయి. ఏసుజననానికి చిహ్నమైన క్రిస్మస్ పండుగను విశ్వాసులంతా ఘనంగా జరుపుకొన్నారు. నూతన దుస్తులు ధరించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అన్ని మతాల వారు అందుబాటులో ఉన్న క్రైస్తవ మిత్రులను, ఆత్మీయులను వ్యక్తిగతంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. దూరంగా ఉన్న వారికి సెల్‌ఫోన్ ద్వారా తెలిపి సంతోషాన్ని పంచుకున్నారు. విశ్వాసులంతా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అన్ని చర్చిలు విశ్వాసులతో నిండిపోయాయి. పాస్టర్లు ఏసు సందేశాన్ని తెలియజేశారు. తోటి మానవుడి పట్ల ప్రేమ, దయ, కరుణ కలిగి వుండాలని సూచించారు. యువతి, యువకులు వేర్వేరుగా క్రీస్తును స్తుతిస్తూ, ఆరాధిస్తూ పాటలు పాడి, నృత్యాలు చేశారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. పేద, ధనిక అన్న తేడా లేకుండా అందరూ కలిసిమెలసి ప్రేమవిందును ఆరగించారు. పలువురు క్రిస్మస్ తాత వేషధారణతో అలరించారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు : పట్టణంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్కిల్‌డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి హాజరయ్యారు. అలాగే స్థానిక లూథరన్ చర్చి, రెడ్డివారిపల్లె చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పాస్టర్ల ఆశీస్సులు పొందారు. పాస్టర్లు దైవ సందేశాన్ని క్రైస్తవ భక్తులకు అందించారు. స్వగ్రామం రెడ్డివారిపల్లెలోని స్వగృహంలో క్రైస్తవులు, పార్టీ కార్యకర్తలు, నాయకులకు క్రిస్మస్ విందు ఏర్పాటు చేశారు. పట్టణంలోని లూథరన్ చర్చిలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి క్రిస్మస్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముద్దా బాబుల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ తోట శివసాయి, సీడీ నాగేంద్ర, సిహెచ్. రమేష్, మందల నాగేంద్ర, జనార్దన్‌రాజు, బండారు మల్లికార్జున, ఆకేపాటి రంగారెడ్డి, కొరముట్ల పునిత్‌రాయ్, గణేష్, మలిశెట్టి వెంకటరమణ, సుదర్శన్‌రాజు, నాగేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : యల్లాయపల్లె సచివాలయ సమీపంలోని చర్చిలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ జరుగు నారాయణరెడ్డి 500 మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, శ్రీను, చంద్రయ్య, యల్లాయపల్లె మాజీ సర్పంచ్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మంగంపేట పునరావాస కాలనీలోని చర్చిలో డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

రాయచోటి టౌన్ : ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణంలోని గున్నికుంట్ల రోడ్డులో ఉన్న హోబ్రోనా చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఫాదర్ కరుణాకర్ ఆధ్వర్యంలో మత పెద్దలు నోవాదాస్, బర్నదాస్, మోషే డేవిడ్‌రెడ్డి చేతుల మీదుగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి బైబిల్ అందజేశారు. పట్టణంలోని ఇతర చర్చిలలో జరిగిన కార్యక్రమాల్లో పాస్టర్ సుభాకర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు జానం రవీంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం : ప్రభువైన ఏసుక్రీస్తు లోకాన్ని రక్షించేందుకు లోకరక్షకుడై దివి నుంచి భువికి వచ్చారని గ్రేస్ ప్రార్థనా మందిరం పాస్టర్ యోహాన్ అన్నారు. సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లె, భాకరాపేట, బెటాయలిన్ ఎదురుగా, బైబిల్ మిషన్ స్వస్థత శాల, శాంతినగర్, సిద్దవటంలోని ఎగువపేట, దిగువపేట, ఎస్.రాజంపేట, వంతాటిపల్లె, టక్కోలి, కడపాయపల్లె, నిర్మల గిరికాలనీ, వెలుగుపల్లి, జ్యోతి గొల్లపల్లి మరికొన్ని గ్రామాలలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిద్దవటం దిగువపేటలోని గ్రేస్ ప్రార్థనా మందిరంలో పాస్టర్ యోహాన్ పిల్లలచే కేక్ కట్ చేయించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

సంబేపల్లె : మండల కేంద్రంలోని గుట్టలోని చర్చిలో నాయకుడు వీవీ ప్రతాప్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ రామచంద్ర మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

చిన్నమండెం : మండల పరిధిలోని పలు చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

గాలివీడు : స్థానిక గేటు వద్ద గల చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో ముఖ్య అతిథిగా వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి పాల్గొన్నారు. బస్టాండ్ వద్ద గల కర్మెలు చర్చిలో పాస్టర్ తిమోతి రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, జయన్న, భాస్కర్, విశ్వాసులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని లక్కిరెడ్డిపల్లె సెయింట్ జోసెఫ్ క్యాథలిక్, లూథరన్, మద్దిరేవుల, మిస్సా, ప్రొటెస్టెంట్ సంఘాల చర్చిలలో వేడుకలు నిర్వహించారు. సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చిలో ఫాదర్ విజయమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో దివ్యబలి పూజ నిర్వహించారు.

రామాపురం : మండల కేంద్రంలోని ఆర్‌సీఎం చర్చితోపాటు ఇతర చర్చిలలో భజనలు చేశారు.

చిట్వేలి : చిట్వేలి అరుంధతివాడలో ఉన్న మన్నా ప్రార్థనా మందిరంలో పాస్టర్ జి.శ్యాముల్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



రాజంపేట టౌన్ : 'ఏసురాజు జన్మించే.. సంతోషంతో నిండె' అంటూ చిన్నారుల నృత్యం



ఓబులవారిపల్లె : పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు



లక్కిరెడ్డిపల్లి: క్రీస్తు సందేశం తెలియజేస్తున్న ఫాదర్ విజయ్‌మోహన్‌రెడ్డి



గాలివీడు : మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ యదుభూషణ్‌రెడ్డి



సిద్దవటం : మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పాస్టర్ యోహాన్



ఓబులవారిపల్లె : పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న నేతలు

జగన్ పాలనలో సంక్షేమ విప్లవం

- పేదల జెండా.. అజెండా వైఎస్ఆర్‌సీపీనే
- 28న బీసీ సామాజిక సాధికార బస్సుయాత్ర
- విజయవంతం చేయాలి
- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

చిన్నమండెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని దశరథరామిరెడ్డి కల్యాణ మండపంలో జరిగిన చిన్నమండెం మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ఆధారంగా ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి అందుతోందన్నారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, మంచి పనులు చేసినాము కాబట్టి ప్రజలను ధైర్యంగా ఓట్లు అడిగే హక్కు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. జగనన్న పాలనలోని నాలుగున్నరేళ్లలో జరిగిన సామాజిక న్యాయాన్ని ఈ నెల 28న రాయచోటిలో జరగనున్న బీసీ సామాజిక సాధికారిత బస్సు యాత్రలో ఎలుగెత్తి చాటుదామని పేర్కొన్నారు. పెత్తందారులతో జరిగే యుద్ధంలో పేదవాడి విజయానికి బాటలు వేయాలని సీఎం జగన్ ఆకాంక్షిస్తున్నారన్నారు. మన ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కల్పించిన ప్రాధాన్యత ఈ రాష్ట్ర చరిత్రలోనే కాదు, దేశ చరిత్రలో కూడా మునుపెన్నడూ చూడలేదన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రగతిని ఒక హక్కుగా జగన్ ప్రభుత్వం వారికి అందించిందన్నారు. రూ.2.50 లక్షల కోట్ల డీబీటీలో 75 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చేరడమే దీనికి నిదర్శనమన్నారు.

బస్సుయాత్రకు రాష్ట్ర నేతలు

రాయచోటిలో ఈ నెల 28న జరగనున్న బస్సు యాత్రకు రాష్ట్ర నాయకులు అనిల్‌యాదవ్, అంజద్ బాషా, మేరుగ నాగార్జున, విడదల రజని, నందిగాం సురేష్ తదితర బడుగు, బలహీన వర్గాల నేతలు ముఖ్య అతిథులుగా రానున్నారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

ఇంటింటా వివరించాలి

అర్హతే ఆధారంగా ఇంటింటికీ అందిన మేలును వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, నాయకులు వివరించాలన్నారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య గల తేడాలను కూడా చెప్పాలన్నారు. ప్రతిపక్ష పార్టీ, పచ్చమీడియా దుష్ప్రచారాలను తిప్పి కొట్టే విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, పార్టీ విధానాలను వివరించాలని తెలిపారు.

నాలుగున్నరేళ్ల పాలనలో..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో రాయచోటి పట్టణంలో రాయుడు కాలనీ, సిబకతుల్లాకాలనీ, ఇందిరమ్మ కాలనీలు నిర్మించారని గుర్తు చేశారు. అదే సీఎం జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో పట్టణ పేదల కోసం నారాయణరెడ్డిపల్లె సమీపంలో 6 వేల ఇళ్లతో జగనన్న కాలనీని అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 20 వేలకు పైగా పక్కాగృహాలు మంజూరు చేశారన్నారు. 93 జగనన్న కాలనీలు నిర్మితమవుతున్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ అందిస్తున్నామన్నారు. 6 వేలకు పైగా వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఇచ్చామన్నారు.

దిగువగొట్టివీడు సోత్రియం భూముల సమస్యకు పరిష్కారం

దిగువగొట్టివీడు గ్రామంలో శోత్రియం భూములను హక్కుదారులు ఎవరికైనా అమ్మాలన్నా, వారసులకు ఇవ్వాలన్నా ప్రభుత్వ అనుమతులు ఉండేవి కావన్నారు. దిగువగొట్టవవీడు గ్రామంలో మొత్తం భూమి 5019.26 ఎకరాలు ఉందని, ఇందులో ప్రభుత్వ భూమి 3276.90 ఎకరాలు, శోత్రియం భూములు 1585.62 ఎకరాలు ఉన్నాయని, ఈ సమస్య పరిష్కారంతో గ్రామంలో 670 మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. ఫలితంగా 21 సంవత్సరాల సమస్యలకు పరిష్కారం జరగడం ఆనందంగా ఉందన్నారు. ఈ భూముల క్రయ విక్రయాలు జరుపుకునేదానికి అధికారులు తగిన అనుమతులను రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపడం జరిగిందన్నారు. అలాగే సంబేపల్లె మండలంలోని ప్రకాష్‌నగర్ కాలనీలోని దళితులు 157 మందికి జెడ్ ఎస్‌డీసీ పట్టాల సమస్యలను త్వరిగతిన పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి చెరువును కృష్ణా జలాలతో నింపడమే తన ధ్యేయమని అన్నారు. గండికోట, కాలేటివాగు పథకం పనులు 80 శాతం మేర పూర్తి కావస్తున్నాయన్నారు. చిన్నమండెం మండలంలోని చెరువులను ఎత్తిపోతల పథకం ద్వారా నింపుతామన్నారు.

సమష్టి కృషితో మెరుగైన మెజార్టీ సాధిద్దాం

సమష్టి కృషితో చిన్నమండెం మండలంలో మెరుగైన మెజార్టీ సాధిద్దామని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి అన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమం, అభివృద్ధి పథకాలు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చేసిన సేవలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజలను మరింత మొగ్గు చూపేలా సైనికుల్లా పని చేసి చిన్నమండెం సత్తా చూపిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు రంగారెడ్డి, బాబురెడ్డి, వైస్ ఎంపీపీ ఏజాస్‌అలీఖాన్, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, జేసీఎస్ మండల కన్వీనర్ చుక్కా అంజనప్ప, ఎంపీటీసీలు రమేష్, శ్యామ్, రమణ, రెడ్డప్ప, వెంకటప్పనాయుడు, సర్పంచులు నజీర్‌అహ్మద్, లోకేశ్వరరెడ్డి, ముసల్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, జగన్నాథరెడ్డి, అఫ్రోజ్, దామోదర్, సుధాకర్, మాజీ సర్పంచ్ అమ్మాజీ, మాజీ ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రెడ్డివరప్రసాద్, నాయకులు ఖదీర్, భూషణ్‌రెడ్డి, ధనుష్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, శివారెడ్డి, నాగశేషారెడ్డి, సాయిపీర్, ఫయాజ్, శ్రీను, రామాంజులురెడ్డి, రామిరెడ్డి, సీతాపతిరెడ్డి, ఆనంద్, సుధాకర్, భాస్కర్, ముసల్‌రెడ్డి, సుదర్శన్‌బాబు, చంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామాంజులురెడ్డి, జేసీబీ శేఖర్, శంకర్‌రెడ్డి, పార్టీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

నాణ్యమైన సేవలు అందించాలి

రాయచోటి టౌన్ : నాణ్యమైన సేవలతోనే వినియోగదారుల మన్నలను పొందాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని జిల్లా కలెక్టరేట్ ఎదురుగా బండలపల్లె మాజీ ఎంపీటీసీ ˜మణ కుమారుడు ఆంజనేయులుకు చెందిన మేఘన కేఫ్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ రవిశంకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పప్పిరెడ్డి మహేశ్వరరెడ్డి, జనార్దన్ రెడ్డి, రామచంద్ర, రామ్మోహన్‌ఎడ్డి, లక్ష్మయ్య, రెడ్డిబాబు రెడ్డి, రెడ్డెయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుప్పావై ప్రవచనాలు

మదనపల్లె సిటీ: ధనుర్మాస మహోత్సవాలను పురస్కరించుకుని స్థానిక బర్మావీధిలోని షిర్డిసాయిబాబా ఆలయంలో సోమవారం తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు. ఆలయ మండపంలో గోదా,రంగనాథుని చిత్రపటాలకు ప్రత్యేకంగా పూజలు చేశారు. తిరుప్పావైలోని పాసురాలను పఠించారు. మహిళలు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాబునాయుడు, అర్చకులు రాము పాల్గొన్నారు.

రూ. 1.40 కోట్లతో తారు రోడ్డు

పీలేరు రూరల్ : మండలంలోని మేళ్లచెరువు పంచాయతీ వడ్డిపల్లెకు రూ. 1.40 కోట్లతో తారు రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ చిన్నకొండయ్య, ఎంపీటీసీ కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. సోమవారం రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 75 సంవత్సరాల నాటి కల నేటితో నెరవేరిందని తెలిపారు. మంచాలమంద రోడ్డు నుంచి వయా రెడ్డివారిపల్లె మీదుగా వడ్డిపల్లెకు 1.5 కిలోమీటరు తారు రోడ్డు మంజూరు కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులు పారంభించడంతో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అమరనాథరెడ్డి, సురేంద్రరెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి, రవికుమార్‌నాయుడు, వెంకటరమణ, బొజ్జయ్యనాయుడు, కృష్ణయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

రేపు లక్కీడిప్ డ్రా


మదనపల్లె సిటీ: మదనపల్లె వన్ డిపో కార్యాలయంలో ఈనెల 27వ తేదీన మదనపల్లె–బి.కొత్తకోట బస్సులో ప్రయాణించిన ప్రయాణికుల కోసం లక్కీడిప్ తీయనున్నట్లు మదనపల్లె–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. గెలిచిన విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు దత్తాత్రేయ జయంతి ఉత్సవాలు

రామాపురం : మండలంలోని నీలకంట్రావుపేట పంచాయతీ పరిధిలోని శ్రీ దర్బారు సాయి నగరంలో శ్రీ దత్తాత్రేయ జయంతి ఉత్సవాలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు శ్రీదర్గా స్వామి కార్యనిర్వాహకులు సత్యమయ్య, శంకర్ స్వాములు తెలిపారు. ఉదయం 10 గంటలకు పంచామృత అభిషేకాలు, పూజలు, మధ్యాహ్నం 1గంటకు నారాయణస్వామి సేవా కార్యక్రమాలు అనంతరం అన్నదానం నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. సాయంత్రం దర్గాలో ఖాదర్‌వల్లి బాబా జెండా మెరవణి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రి శ్రీ సాయి నాథుని పల్లకీ ఉత్సవాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం

రాజంపేట టౌన్ : పట్టణంలోని రీజెన్సీ నలంద స్కూల్‌లో సోమవారం రాత్రి శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొలుత కల్యాణ ఉత్సవ మూర్తులను ప్రత్యేక పుష్పాలు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి, టీటీడీకి చెందిన వేదపండితులు వేదమంత్రోచ్ఛారణలతో కల్యాణ క్రతువును నిర్వహించారు. శ్రీవారి భక్తసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. కల్యాణం అనంతరం నిర్వాహకులు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేద్దాం

- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : జిల్లా యంత్రాంగం అంతా సమష్టిగా పని చేసి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేద్దామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. క్రీడా పోటీల ఏర్పాట్లపై ఆయన సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని 76 సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం అవుతాయని తెలిపారు. వాలీబాల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ, షటిల్ తదితర 5 అంశాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. 15 సంవత్సరాలు పైబడిన వారందరూ పాల్గొనేలా చూడాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకుని పోటీలను విజయవంతం చేయాలన్నారు. గ్రామీణ స్థాయి నుంచి యువతలో క్రీడా స్ఫూర్తిని వెలికి తీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే విధంగా క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ప్రారంభం

నందలూరు(రాజంపేట) : నందలూరులో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో మండల పరిషత్ అధ్యక్షులు మేడా విజయభాస్కర్ రెడ్డి క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సౌభాగ్యమ్మ తెలిపారు. మండల పరిధిలోని జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ మెంబర్, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, మైనార్టీ కార్పొరేషన్ నాయకులు, మండల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు హాజరు కావాలని తెలిపారు.

పుల్లంపేట : మండల పరిధిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు డిసెంబర్ 26వ తేదీ నుంచి జనవరి 9 వరకు 15 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘురాం తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం జరిగిందని తెలిపారు. వారు మాత్రమే పాల్గొనాలని తెలిపారు.

సిద్దవటం : మండలంలోని 10 గ్రామ సచివాలయాల పరిధిలో మంగవారం నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు జరుగునని ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.పులిరామ్‌సింగ్ తెలిపారు. గ్రామ శివారులో ఉన్న ఈద్గా వద్ద మైదానంలో క్రీడా పోటీలు నిర్వహిస్తామని గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ రెడ్డి తెలిపారు.

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండలంలోని చక్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించనున్నారని పేర్కొన్నారు.